


# పండుగ లచ్చిమి

డాక్టర్ నక్కా విజయ రామరాజు

**కుం**టెంకయ్య గుడిసెనకాల తాటిగులకలపాతర చుట్టూ చేరారు పది మంది దాకా పిల్లలు. అందరూ పది పదిహేను సంవత్సరాలలోపే! నాలుగు రోజుల ముందు కాల్చిన తాటి గులకలు ఎట్టా వున్నాయ్యో అన్న అతృత ఎక్కువగా ఉంది. బుల్లియ్య పాతర మీదున్న మట్టిని పారతో పెక లిస్తుంటే సోమయ్య, ఎంకయ్య మట్టికిందున్న పచ్చి తాటాకుల్ని లాగుతు న్నారు. పాతర బయటపడింది. నల్లగా కాలిన తాటిగులకల్ని చూడగానే బంగారం గని దొరికినంత ఆనందం వేసింది వారికి. వాటిని గోనెపట్టా మీద పోశాడు కిట్టయ్య. చుట్టూ మూగిన పిల్లలంతా తలో చెయ్యేసి గుల కల పొడిని వలుస్తున్నారు. వారి చేతులు ఒళ్లు బొగ్గుమసిలా తయారై నాయి. గులకలపొడిలో సుబ్బారావు తెచ్చిన వరి ఊకను కలిపేసిన సాంబయ్య, పిల్లలు తెచ్చుకున్న పాతగుడ్డ పేలికల్లో తలో సోలెడు గులకల పొడి పోస్తుంటే బుల్లియ్య వాటి మూతికట్టి ఇస్తున్నాడు. పిల్లలందరికీ పూలపొట్లాలు అందినయి. దీపావళి పండక్కి పూల పొట్లాలు తయార్! మసి ముఖాలన్నీ మతాబుల్లా వెలిగిపోయినయి. ఒక చేత్తో పూలపొట్లాం రెండో చేత్తో మధ్యకు చీల్చిన పచ్చి తాటాకు మట్టా పట్టుకొని –

''కోడి గుడ్డుగాలే! గొట్టాంగాలే! పప్పుల ఎంకయ్య గుడ్డులు కాలే! గుడ్డులకింద వరాలు రాలే! ఏరుకో ఎంకట సుబ్బమ్మా'' అని పాట పాడుకుంటూ ఇళ్ళకు పరిగెత్తారు పిల్లలంతా.

''అన్నా ఆ పాట పాడేది మాపటేల దీపాల పెట్టినాక పూలపొట్లాల మీద నిప్పులేసి అయ్యి బాగా కాలినాక గిరా గిరా గుండ్రంగా తిప్పుతూ పాడుతారు కదర్రా? మరిప్పుడే పాడతన్నారే? అంది సోములు చెల్లెలు బుజ్జి. ''మనిట్టం ఎప్పుడు కావాలంటే అప్పుడు పాడతాం...'' అన్నాడు సోములు. ''కోడిగుడ్డు కాలే గొట్టంగాలే'' పాట పాడు కుంటూ ఇంటివైపు లగెత్తారిద్దరు.

పూలపొట్లాలతో ఇంటికొచ్చిన బుజ్జి సోమయ్య చేతులు ముఖం నిండా బొగ్గుమసే! ''అమ్మా! ఆకలేత్తుంది తొంద రగా బువ్వపెట్టమ్మా'' ఇద్దరూ ఒకేసారి అరిచారు. వాళ్ల అవ తారాలు చూసిన రత్తమ్మకు కోపం వచ్చింది. తొట్టి దగ్గర కాళ్ళు చేతులు కడుక్కున్నారిద్దరు. ''రాత్తిరిక్కూడా బువ్వ తినలేదు. బాగా ఆకలిగా వుంది తొందరగా పెట్టమ్మా'' రత్తమ్మ చీర కొంగు లాగుతూ ఏడుపు మొదలెట్టింది బుజ్జి. ''నానింకా రాలేదమ్మా, నాన్న బియ్యం తేగానే బువ్వ వండుతా, అట్టా పోయి ఆడుకుని రండమ్మా కొంపలో చారెడు నూకలు కూడా లేవు. ఏం చెయ్యను! ఏం పండగో పాడు పండగ'' తిట్టుకుంది రత్తమ్మ. ''అమ్మా నేనాడుకోనే కాళ్లు పీకుతున్నాయి. ఈడే వుంటా'' నంటూ వేపచెట్టు కింద గోనెపట్టా పరుచుకుని పడుకుంది బుజ్జి. సోములు ఆడుకో డానికెళ్ళాడు. పంతగాని ఈరమ్మ ఇంటిముందున్న రోటిలో

మొక్కజొన్నలు దంచుతున్నారు భాగ్యం, లంకమ్మ. బుజ్జి పడుకుందేగానీ నీరసం తగ్గలేదు. పిల్లల్తో ఆడుకున్నంతసేపు పూలపొట్లాలు కట్టుకున్నంతసేపూ ఆకలి తెలీలేదు. ఖాళీగా ఉంటే ఎక్కడ లేని ఆకలి వేస్తుంది. ఇంటి ఎదురుగ్గా దంచుతున్న రోకటి పోటులు వింటూనే వుంది బుజ్జి. కొద్దిసేపటికి పిండి జల్లించి తీసుకుపోయింది భాగ్యం. రోకళ్లు తీసుకుపోయింది లంకమ్మ. మెల్లిగా లేచి రోలు దగ్గరకెళ్లింది బుజ్జి. రోట్లో అడుగున మిగిలిపోయిన పిండిని గీకి గీకి నోట్లో వేసుకుంది. తియ్యగా కమ్మగా వుంది జొన్నపిండి. అది అంగిట్లోకే రాలేదు. మళ్ళీ గీకింది. పిండేమీ రాలేదు. అట్లాగే వంగి రోటిగుంటలో తల పెట్టి రోలంతా నాకుతోంది బుజ్జి. 'పెటిల్'మని వీపుమీద దెబ్బ పడేసరికి దిగ్గున లేచింది బుజ్జి. ''సిగ్గు శరం లేదంటే కుక్కలాగా రోట్లో నాలిక పెట్టి పిండి నాకుతావంటే శంబాడిదానా'' అంటూ ఇంకో రెండు తగిలించింది రత్తమ్మ. ఏడుస్తూ ఇంటికొచ్చింది బుజ్జి. గోనె పట్టామీద పడి నిద్రపోయింది. ''ఎదవ బతుకులు.. ఏం సెయ్యాలి? సచ్చినా బాగుండు! ఆకలి. ఆగమంటే ఆగొద్దు! అయినా దానిదెంతపేనం. నిన్నట్నుంచి గంజికూడా తాగలేదయ్యే. ఆకలికదెట్టా తట్టుకుంటది? పెద్దోల వల్లే కావట్లేదు'' అనవసరంగా బుజ్జిని కొట్టినందుకు బాధపడింది రత్తమ్మ.

ఇంటి దగ్గర కూర్చున్నా ఏమీ తోచడం లేదు. కుండలు, గిన్నెలు ఇంకోసారి వెదికింది. నూకలు, మెరికలు ఏమన్నా ఏ కుండ అడుగునన్నా మిగిలుండక పోతయ్యా అన్న ఆశతో. అట్లా వెదకడం నాలుగోసారి. ఏమీ లేవని తెల్సినా ఆశ చావక పక్కనున్న పుల్లమ్మ ఇంటికెళ్లింది. అక్కడా రెండు రోజుల్నుంచి పొయ్యిలో పిల్లి లేవలేదు. వరి పొలాల్లో కలుపులు అయిపోయినాక చెయ్యడానికొక్క పనీ దొరకడం లేదు. రెక్కాడితే గానీ డొక్కాడని బతుకులు. కూలీ దొరక్కపోతే డబ్బులెక్కనుంచి వస్తాయి. ఏడ్నుంచి తెచ్చిపెట్టాలి పిల్లలకి? పల్లె సగంపైగా ఖాళీ అయిపోయింది. కర్నూలుకు కుండలు కట్టుకుని, పొట్ట చేత పట్టుకుని పడమట పోయారు జనం. అక్కడ మిరప, పత్తి చేలల్లో ఏదొక పని దొరుకుద్దని. మళ్ళీ వరి కోతలు మొదలెట్టేపుడు గానీ రారు. ''మనం కూడా పడమట పోదాం'' అంది రత్తమ్మ రాములుతో. కట్టెలు కొట్టం తప్ప వ్యవసాయపనులు రాని రాములు రానన్నాడు. పిల్లలకు బడి ఆగిపోద్దన్నాడు. సరేనని ఉండిపోయింది రత్తాలు.

పస్తులు తప్పడం లేదు. ఆలోచనల్లో వుండగానే అంకమ్మ ఇంటి కొచ్చింది రత్తమ్మ. 'ఎర్ర జొన్నలెక్కడియ్యే?' పిండిని ఎసట్లోపోస్తున్న అంకమ్మను అడిగింది రత్తమ్మ. ''తోకపాలెం నుంచి మా అయ్య తెచ్చిచ్చాడత్తా. పీతలచారుతో ఓ ముద్ద తినెల్లయ్య అన్నా ఇనిపిచ్చుకోకుండా ఎల్లిపోయేడు'' తెడ్డుతో జొన్న సంకటి తిప్పుతూ చెప్పింది అంకమ్మ. ఇంకా జొన్నలు మిగిలినట్టు లేవు. వుంటే అడక్కుండానే ఇచ్చేది. దాని దగ్గర లేనపుడు అనవసరంగా అడిగి లేదనిపించుకోడం దేనికి? అనవసరంగా మాట పోద్దని అడక్కుండానే తిరిగొచ్చింది రత్తమ్మ.

సొంగమ్మ ఇంటెనకున్న పుట్టం దగ్గరకెళ్లొచ్చింది. అప్పటికే మూడు నాలుగుసార్లు. దసరా, దీపావళి పండుగలకి ఉసిళ్లు లేస్తాయక్కడ. వాటిని మంగళంలో వేసి పిల్లలకు పెడదామని రత్తమ్మ ఆశ! ఆ రెండు మూడురోజుల్లో ఒక్క ఉసీ లేవలేదు. పుట్టగొడుగులకోసం తిరిగింది. ఎక్కడా కనబడలేదు.

****

మసీదులో సాయిబు అజాలో నిద్రలేని పనులు ముగించుకుని గొడ్డలి బుజానేసుకుని తామరతత్తయ్య కట్టెల అడికి వెళ్ళిపోయాడు రాములు. రోజూ పున్నీళ్లు తాగెల్లేవాడు. ఆ రోజు అవి కూడా లేదు. పండగకదా షావుకారింట్లో ఏమన్నా పెట్టకపోతారా అనుకున్నాడు మనసులో. రాములకి మీసకట్టు మొలిచిన దగ్గర నుంచి ఆ షావుకారి దగ్గర కట్టెలడితిలో కట్టెలు కొట్టే పనే! తెల్లారకముందే పనిలోకెల్తే దీపాలు పెట్టినాకగానీ ఇంటికి చేరడు. వచ్చేపుడు ఓ తవ్వెడు బియ్యం మూట తెస్తే దాంతో అన్నమో గంజో కాచేది రత్తమ్మ. పిల్లలకు పెట్టి తాము ఎంగిలిపడేవాళ్ళు.

తామరత్తయ్యకు ఊరిమధ్యలో రథం సెంటర్లో పెద్ద కట్టెల అడితె, బియ్యం దుకాణం! ఈ రోజు లక్ష్మిపండుగకదా కట్టెలు కొట్టగూదురా బియ్యం బస్తాలన్నీ కుట్టి మెట్టుమీద వేసి గదులన్నీ సుబ్బరంగా ఊడ్చి కడగాల్రా'' అన్నాడు గొడ్డలి భుజాన వేసుకొచ్చిన రాములును గుమస్తా కనకయ్య. బియ్యం పని పూర్తయ్యేసరికి పొద్దు నడినెత్తికెళ్లింది. అడితిలో కట్టెలన్నీ వరసగా పర్చురా అడ్డదిడ్డంగా పడున్నాయి అన్నాడు కనకయ్య. వాటగిని సర్దేసరికి పొద్దు కరకరలాడుతోంది.'' ఓ మానికెడు బియ్యం, ఓ పదిరూపాయలిప్పించండి గుమాస్తాగారు. పండగపూట ఏమన్నా చేసుకుంటాం'' అన్నాడు రాములు. ఆ మాటకు పక్కన లక్ష్మీ బాంబు పేలినంతగా ఎగిరి పడ్డాడు గుమాస్తా. 'దీపావళి పండగంటే ఏమనుకున్నావ్? లక్ష్మి పండగరా! పండగపూట బయటోళ్లకి డబ్బులిస్తే లక్ష్మి బయటికి పోదూ? అయినా అలగా జనానికి ఇట్టాటివేం తెలుస్తుందిలే'' అని గొనుక్కుంటూ చెడామడా తిట్టాడు గుమస్తా. 'లక్ష్మి పూజకు మామిడాకులు, అరటాకులు తీసుకురా పో! ఇంకా ఇక్కడే నిలబడ్డావే'' అని కసురుకున్నాడు గుమస్తా. మారుమాట్లాడకుండా మామిడితోట కెళ్లాడు రాములు. ఆచారి వచ్చేలోగా అరిటాకులు మామిడాకుల్తో పూజగదిని అలంకరించాడు రాములు. షావుకారు, ఆయన భార్య పూజలో కూర్చున్నారు. ఆయన పిల్లలు




కొత్త బట్టలతో వారికెదురుగ్గా కూర్చున్నారు. ఆచారి ఏవేవో మంత్రాలు చదువుతూ వారితో పూజ చేయిస్తున్నాడు. పంచలో వున్న కనగాల చెవిటి సాయిబు మిషను ఆగకుండా సప్పుడు చేస్తూనే వుంది. కొత్త బట్టకోసం వచ్చిపోయే వాళ్ళతో బిజీగా వున్నాడు సాయిబు. లేకపోతే ఈ వేళకు కాఫీ తాగటానికి లేచేవాడు సాయిబు. అతన్తోపాటు హోటల్‌కి పోతే కాఫీతో పాటు అపుడపుడు ఇడ్లీలు కూడా దొరికేవి. రాములు కడుపులోని పేగులు సాయిబు కుట్టుమిషను కన్నా ఎక్కువ సప్పుడు చేస్తున్నాయి.

పూజ పూర్తయింది. దక్షిణ, బియ్యం, మిఠాయిలు తీసుకుని వెళ్ళిపోయాడు ఆచారి. అప్పటిదాకా పెరట్లో అంట్లు తోముతున్న ఏనాది రంగమ్మను చాకలి వీర్లంకను, మంగలి ఈరమ్మను పిలిచింది షావుకారి భార్య. చక్రపొంగలితో పాటు, పిండివంటలు అన్నం కూరలు పెట్టింది. వాళ్ళ బుట్టలు నిండిపోయినయి. రాములు వరండాలోనే సాయిబు మిషను దగ్గరే కూర్చుని ఉన్నాడు. తనను కూడా పిల్చి ఏమన్నా పెడుతుందని, ఇంటికిపోయి పిల్లలకు పెట్టుకుందామని ఆశగా ఎదురుచూస్తున్నాడు. ''అంట''ని పూజగదిలోకి పిలవలేదు. దేవుని దగ్గర పెట్టిన మిఠాయిలు పెట్టరు. ప్రసాదం పెట్టరు. పూజగదిలో ఊడవడం దగ్గర్నుంచి కడగడం, ఆకులు కట్టందాకా మాత్రం తనే చెయ్యాలి. అప్పుడు 'అంటు' అడ్డురాలేదు. షావుకారిగారి భార్య పట్టుచీర కట్టుకుని ఒంటినిండా నగలు దిగేసుకొని ఇత్తడి పళ్లెంలో మిఠాయిల్తో బయటికెళ్లింది. మిషను కుడుతున్న సాయిబుకి రెండు లడ్డూలు, గారెలు ఇచ్చింది. వాటిని కాగితంలో చుట్టి పక్కన పెట్టాడు. షావుకారిగారి కుటుంబం భోజనాలయిపోయినయి. చుట్టాలు స్నేహితుల్తో సందడి సందడిగా వుంది ఇల్లు. ఏమన్నా మిగిల్తే ఇంటికి తీసుకెల్దామని ఆశగా చూస్తున్నాడు రాములు. ఇంటకాగిన వాళ్లకు వద్దన్నా బలవంతంగా తినిపిస్తున్నారు. వాళ్లు తినలేక ఆయాసపడుతూ లేచి చేతులు కడిగేసుకున్నారు. మిగిలిపోయినవన్నీ చాకలి, మంగలి, ఏనాది పనోళ్లకు పెట్టేసింది షావుకారి భార్య.

వారి బుట్టలు నిండిపోయినయి. ఇహ ఇక్కడుండి లాభం లేదని ఇంటికి బయలుదేరాడు రాములు. ''అదేంటిరా! అప్పుడే వెళ్ళిపోతున్నావు షావుకారి గారి పిల్లలు టపాసులు కాలుస్తుంటే దగ్గరుండొద్దు?'' అన్నాడు గుమస్తా కనకయ్య.

పొద్దు పడమటికి వాలింది. ఇల్లుముందు అరుగులమీద ప్రమిదలు వెలిగిస్తున్నారు. టపాకాయల మోత అప్పుడప్పుడు విన్పిస్తోంది. చెవిటి సాయిబు మిషను కట్టేసి కనగాల బయల్దేరాడు.


''ఇదిగో రాములు ఇవి మీ పిల్లలకి పెట్టంటూ'' మధ్యాహ్నం ఇంటి యజమాని ఇచ్చిన లడ్డులు, గారెలు చుట్టిన కాగితం పొట్లాం ఇచ్చాడు. వాటిని భద్రంగా కండువాలో కట్టుకున్నాడు రాములు. ఇళ్ళ ముందు ప్రమిదలలో ఊరంతా కాంతులీనుతోంది. షావుకారి పిల్లలు టపాకాయలు కాల్చడానికి పోటీలు పడుతున్నారు. కాకరపువ్వొత్తులు, విష్ణుచక్రాలు, మతాబులు, లక్ష్మీబాంబులు, చిచ్చుబుడ్లు ఎన్నిరకాలో! కాలుస్తూ కేరింతలు కొడుతున్నారు. పెద్దవీధంతా అదే సందడి. పెద్ద గంపనిండా వున్న టపాసులన్నీ కాలుస్తున్నారు. ఎన్నివందల రూపాయలు కాల్చివుంటారో మనసులోనే లెక్కలేసుకుంటున్నాడు రాములు. ఇంకా టపాసులు కావాలా? గోల చేస్తుంటే వెనక స్టోరుగది నుంచి ఇంకొక పెట్టెడు తెచ్చాడు రాములు. వాటిలో సగం పైగానే కాల్చేశారు. షావుకారు, ఆయన భార్య – పిల్లలు టపాసులు కాలుస్తుంటే ఆనందంగా చూస్తున్నారు. వారి పిల్లల కేరింతలకు వారి ముఖాలు మతాబుల్లా వెలిగిపోతున్నాయి. పిల్లలు అలసిపోయేరు'' ఇంక చాల్లెండి మిగిలినవి నాగులు చవితికి కాల్చుకుందురుగానీ – ఈ బుట్ట తీస్కెలి ఎనకగదిలో పెట్టరా'' అంటూ రాముల్ని కేకేశాడు యజమాని. ఇంటిదగ్గర పిల్లలు కాల్చుకొడానికి రెండు కాకరపువ్వొత్తులు, చిచ్చుబుడ్లు, మతాబులిస్తాడేమోనని ఆశపడ్డాడు రాములు. నిరాశే మిగిలింది. ఊరంతా టపాయకాయల్తో మారుమోగిపోతోంది. సామానంతా సర్దించి ఇంటికెళ్లిపోయాడు గుమాస్తా. టపాకాయల మోతలు తగ్గిపోయినయి. ఉసూరుమంటూ ఇంటికి బయలదేరాడు రాములు. రథం సెంటర్లో పోటీలు పడి ఆసాంతంగా తయారు చేసిన టపాకాయలు కాలుస్తున్నారు కుర్రాళ్ళు. ఆ నాలుగురోడ్ల కూడలిలో జనం ఎటూ పోవడానికి వీలు లేకుండా వుంది. అంతా ఆగిపోయి చూస్తున్నారు. ఆ కూడలిలో కోమటి రాములు కొట్టు వారగా నిలబడి వుంది గుడ్డి అచ్చమ్మ. ఆ టపాకాయలకు భయపడి ఎటుపోవాలో తెలీక.

''ఏందత్తా ఈడ నిలబడ్డావు ఇంటికేనా?'' అడిగాడు రాములు.

''ఈ పిల్లగోళ్ళు గెంటనుంచి ఇడవకుండా టపాకాయలు కాలుత్తుంటే ఎటుపోవాలే తెలవక ఈడే నిలబడ్డానయ్యా'' చెప్పింది అచ్చమ్మ.

పండగ కదా గుడ్డి అచ్చమ్మ బుట్ట నిండిపోయింది. మబ్బులు కీకామండలంగా పట్టినయి. పొద్దున్నుంచి ఉరుముతోంది గానీ వాన లేదు. సన్నగా వాన తుంపర మొదలైంది. వాన పెద్దదైతే కష్టమని బయలుదేరింది గుడ్డి అచ్చమ్మ. ఆమె కర్ర పట్టుకుని ముందు నడుస్తున్నాడు రాములు. సాలీల ఇల్లు, అయ్యంగారిల్ల దాటి చాకలిపాలెం మీదగ వస్తుండగా చాకలి సుక్కమ్మ కేకేసింది గుడ్డి అచ్చమ్మను. 'ఈ నాలుగు బూరెలు పలిగోరం తీస్కెల్లు అచ్చమ్మ'ంటూ.

'వానొచ్చేలా వుంది తొందరగా నడువత్తా' అంటూ తొందర చేశాడు రాములు. వాన పెరిగింది. టపాకాయలు ఆగిపోయినయి. ఊర్లో ఇల్లన్నీ ప్రమిదల కాంతితో వెలిగిపోతున్నాయి. ఊర్లో సందడి తగ్గిపోయింది. ఊరి పొలిమేర దాటగానే వాన పెద్దదైంది. మాలపల్లెలో సందడే లేదు. ఏ ఇంటిముందు దీపం వెలగటం లేదు. ''ఊర్లో జనమంతా టపాకాయలు కాలుత్తు పండగ చేసుకుంటుంటే పల్లెలో జనమంతా నిద్దరోతున్నారు'' అనుకుంటూ పైకే అనేశాడు రాములు.



''ఉన్నొల్లకేరా ఏ పండగడయినా. లేనోళ్లకు ఎండగే'' అంది గుడ్డి అచ్చుమ్మ. ఇల్లు వచ్చేసింది. 'అప్పా.. మీ ఇల్లు వచ్చేసింది. ఇంకా నే పోయొత్తా – దీందుంపతెగ ఈ వాన తగ్గేట్టు లేదు'' అన్నాడు రాములు.

ఇంటి అరుగుమీద కూర్చున్న అచ్చుమ్మ ''అబ్బాయో ఇట్టారా అయ్యా'' అంటూ బుట్ట లోంచి నాలుగు బూరెలు రెండు పప్పులు తీసిస్తూ.. ''పండగ పూట పిల్లలకి పెట్టు'' అంది. బుట్టనిండా అన్నం ఉంది. పులిహోర వుంది. 'అడుక్కొచ్చిన అన్నం పిల్లలేం తింటార్లే' అంది అన్నం తడుముకుంటూ.

పల్లెలో పిట్ట పీచుమనడం లేదు. రాములు ఇంటికి చేరేసరికి పూర్తిగా తడిసిపోయాడు. ఇంటిలో గుడ్డిదీపం కునారిల్లుతోంది. ఇంట్లో సప్పుడు లేదు. పిల్లలు పడుకున్నట్టున్నారు. నల్ల కుక్క తోకాడిస్తూ రాములు దాని తలమీద చెయ్యేసి నిమిరేదాకా అదక్కన్నుంచి కదల్లేదు.

''పిల్లలు పడుకున్నారా'' బనీను విప్పుదీస్తూ అడిగాడు రత్తమ్మను.

''ఇప్పుడు దాకా నువ్వొత్తావని ఏవన్నా తెత్తా వని ఎదురు సూసి సూసి ఇప్పుడే పడకేశారు. సీకటి పడగానే పూలపొట్లాలు తిప్పుకున్నారు. షావుకారింటినుంచి ఏవన్నా టపాకాయలు తెత్తా వని ఎదురు సూశారు పాపం!'' అంది రత్తమ్మ.

''ఆల్లెందుకిత్తారే?'' అంటూ 'ఇగో' అంటూ చెవిటిసాయిబిచ్చిన లడ్డుపొట్లాం, గుడ్డి అచ్చుమ్మి చ్చిన బూరెలు ఇచ్చాడు రాములు.

'ఇది లచ్చిమి పండగంట! డబ్బులివ్వకూడ దంట! బియ్యం కూడా ఇవ్వకూడదంట! ఆ గుమస్తా కనకయ్య అన్నాడు. మన బోటోల్లకి డబ్బులిత్తే లచ్చిమి మనింటికే వత్తదంట!'' – ముఖం కాళ్లు చేతులు కడుక్కుంటూ చెబుతు న్నాడు రాములు.

''అయినా ఆ లడ్డూలు... జిలేబీలు పెట్టి పూజలు చేసే అట్టాటి గొప్పోల ఇల్లకి వత్తదిగానీ తిండికి తికానీ లేని మనబోటి బిచ్చగాల్లింటికెం దుకొత్తదే ఆ లచ్చిమిదేవి గోరూ'' ఎకసెక్కంగా అన్నాడు రాములు.

''ఇంతకీ పిల్లలేమన్నా తిన్నారా'' అడుగు తోంటే పాడిగుడ్డ తీసుకురావడానికి ఇంట్లోకి పోయింది రత్తమ్మ.

రాములు కాళ్లు కడుక్కొచ్చేలోపు మండిగం దగ్గర పెట్టిన బూరెలు గారెలు కుక్క తినేసింది. ప్రాణం ఉసూరుమంది రాములుకి. రత్తమ్మకి కోపం ఆగలేదు. మూలనున్న చీపురు కట్ట తీసు కుని ఒక్కటి పీకింది. కుయ్యో మొర్రో అని అరుస్తూ బయట వానలోకి పరిగెత్తిందది.

''బుజ్జికి వల్లు వెచ్చబడింది.. పొద్దుట్నుంచి ఆకలాకలంటూ ఒకటే ఏడుపు. ఆ రెండు బూరె లైనా తినేవాళ్లు పిల్లలు. మాయదారి ముండ తినే సింది పిల్లకుంచకుండా'' కుక్కను తిట్టింది రత్తమ్మ.

పిల్లలిద్దరు పంచలో ఈతాకు చాపమీద పడు కున్నారు. ఈదురుగాలికి ముడుచుకున్నారు. చిరి గిన లుంగీ కప్పాడు రాములు. బుజ్జి కొద్దిగా కది లింది. ''వల్లు కాలిపోతు వుందే... జొరమొచ్చిన ట్టుంది'' అన్నాడు రాములు. బుజ్జి కొద్దిగా కది లింది.

''అన్నియ్యా! అన్నియ్యా లెగురా! తొందరా లెగూ! నాన్నొచ్చాడు. ఎంత పెద్ద మూట తెచ్చాడో చూడు. అబ్బ! బూరెలు, గారెలు, పూర్ణాలు బెల్ల పన్నం, నెయ్యి ముద్దపొప్పు ఏసుకో. పాయసం అట్టాగా తాగేది? గుంటగిన్నెలో పోసుకోరా! పులి గోరం సూడు ఎంత బాగుందో మంటగా వుందా మిరపకాయ కొరకొద్దన్నానా ఈ బూరి తిను తగ్గుద్ది. అన్నీ మనమే తింటే అమ్మా నాన్నల కెట్టారా ఆల్లక్కూడా గూత్తి ఉంచు'' నిద్రలో కలవ రిస్తోంది బుజ్జి. పిల్లలను అట్లాగే చూస్తు కూర్చు న్నారు రత్తమ్మ రాములు. బయట జోరున వాన కురుస్తూనే వుంది.

'ఢాం'మని పెద్ద చప్పుడైంది. మిద్దెమీద ఎంకయ్య కొబ్బరిచెట్టు మీద పిడుగు పడిన ట్టుంది. ''అమ్మా! అంటూ ఉలిక్కిపడి లేచింది బుజ్జి. రత్తమ్మను వాటేసుకుంది ఏడుస్తూ. మళ్లీ నిద్రలోకి జారుకుంది. ''పిల్ల ఒల్లంతా ఉడికి పోతోంది'' గొనిగినట్టు చెప్పింది రత్తమ్మ. ''తెల్లారినాక నల్లాచారిగోరి దగ్గరకు తీసుకెళ్లి ఇంజీషనేపిత్తే తగ్గిపోద్దిలే'' బరోసా ఇచ్చాడు రాములు.

బయట వాన ఆగకుండా కురుస్తూనే వుంది, మధ్యమధ్యలో ఉరుములు మెరుపుల్తో.

''రేయ్! అబ్బాయ్ రాములూ! ఎంతసేపు న్నుంచి పిలిచినా పలకట్లేదు – పడుకున్నారేం'' గుడ్డి అచ్చుమ్మ గొంతు విని బయటికొచ్చాడు రాములు. వానలో తడుస్తూ ఇంటిముందు నిల బడి వుంది గుడ్డి అచ్చుమ్మ.

''ఈ ఏలప్పుడేందత్తా ఇట్టా వచ్చావు. అయ్యో తడిసి ముద్దయి పొయ్యావు సూడు'' అంటూ ఇంట్లోకి తీసుకెళ్లాడు రాములు అచ్చుమ్మను.

''నేను ఊర్లోంచి వచ్చేపాటికే ఇంటోవాల్లంతా తినేసి పడుకున్నారా. రేపటికి సద్దిబడి పోతయి మీరన్నా తింటారని తెచ్చా. బెల్లపన్నం ముద్ద పప్పు, పురిగోరం, కూరలు, పప్పు చారులు వున్నాయి తినండి'' అంటూ కొంగు కప్పిన బుట్ట సంకలోంచి దించింది గుడ్డి అచ్చుమ్మ. రత్తమ్మ రాములు ఒకరి ముకాలొకరు చూసుకున్నారు. గుడ్డిదీపం వెలుగులో అచ్చుమ్మ ముఖం వెలిగిపో తుంది.

★

నక్కా విజయ రామరాజు

94407 47768